
# అభ్యుదయాని కిటువైపు



- 'శిరీష', 'తులసీకృష్ణ'

'రాధా!

ఎట్లా తీసేసేదే ఈ బాధ? మనం మూడుసార్లు కలుసుకున్నాము. కానీ, మూడు మాటలు కూడా మాట్లాడుకో లేక పోయాము. ఎవరికీ స్వరం పెగల్లేదు. అన్నీ జ్ఞాపకాలు! గుండె బద్దలుచేసే జ్ఞాపకాలు! దేన్ని గురించి మాట్లాడ్డం? దేన్ని తలుచుకోకుండా ఉండడం గతంలో! అబ్బ! రాధా! నే నెంత దౌర్భాగ్యురాల్నే! ఈ లోకంలో ఇద్దరు ప్రాణ స్నేహితురాండ్రున్నారంటే వింతకాదు. వాళ్లలో ఒకదానికి పెళ్ళయిన కొద్దికాలంలో మరో దానికి పెళ్ళి జరుగుతూందంటే జరగరాని దేమీ కాదు. ఆ పెళ్లికూతుర్ని తాను భర్తతో కలిసి ఇంకొంచెంసేపట్లో చూస్తానని ఆ స్నేహితురాలు ఊహించుకోవడంలో పొరపాటు లేదు. కానీ ... కానీ, ఆ పెళ్ళికూతురు తన స్నేహితురాలింకా రాలేదని కోపం కళ్ళలో ఎర్రబడి ఏడ్పుగా మారుతున్నప్పుడు, మహాపాత్రం

వచ్చేసిందని దైవజ్ఞులు తొందర చేస్తూ ఉన్నప్పుడు, ఒక భయంకర ప్రళయం మిగతా ప్రపంచం జోలికి పోకుండా తన స్నేహితురాలి తలపైనే పడిందని తెలిస్తే, గుమ్మంలో కొచ్చి నిమిష నిమిషానికీ కారు దిగి వచ్చే భర్త కోసం చూస్తున్న ఆ స్నేహితురాలు శవంగా మారిన తన భర్తను కళ్ల ముందుగా మోసుకొస్తే, ఎంత వింతగా, ఎంత జరగరానిదిగా, విధిదో, దేవుడిదో ఎంత పొరపాటుగా అనిపిస్తుంది! ఆ పెళ్లి కూతురు ఆ విషాదంలో, ఆ మూర్ఛలో, ఆ తంతు కాస్త జరగని అనే పెద్దల మాటలతో, ఆ పరిస్థితిలో మనిషిగాని మనిషిగా ఉన్న తన మెడలో తాళి కట్టించుకోవడమనేది ఇంతకుముందే ఆడదాని కన్నా జరిగిందా? తన మెడలో తాళి ముడి పడుతూన్న సమయంలో తన ప్రాణ స్నేహితురాలి మెడలో తాడు తెగిందని తెలిస్తే ఆ పెళ్లి కూతురు ... అసలు దాన్ని పెళ్లికూతురు అనవచ్చా? నిన్ను ... సౌభాగ్యం కోల్పోయిన నిన్ను ... కొత్త పెళ్లికూతురునై చూశాను. నిన్ను చూశాను, నీ దుఃఖం చూశాను. ఆ క్షణంలోనే ఇంకా మిగిలిన నీ బ్రతుకంతా చూశాను. తప్పు చేయని శిక్ష భరించి చిన్నపోయిన నీ యౌవనాన్ని చూశాను. అప్పటినుంచి నా దాంపత్యంలో సుఖమనే చేదుమాత్ర మింగడం నా వల్ల కాలేదు. మోహన్ కాకపోతే నా దుఃఖాన్ని ఇంత గౌరవంగా పంచుకునేవారు కారేమో? అప్పుడు నా స్థితి చాలా హీనంగా ఉండేది. విన్న అన్నారు. . .

'మృదూ! రాధకోసం నువ్విలా ఏడవటం కంటే ఆమె బాగుపడేందుకేమైనా మార్గముందేమోనని ఆలోచించరాదూ?'

అవును. నేనావిధంగా ఆలోచించలేదు.

'రాధ బాగుపడేందుకు నే నేమైనా చెయ్యగలను. ఎంత త్యాగమైనా ...' ఆవేశంతో అన్నాను.

'మధ్య నీ త్యాగం ఏమీ అవసరం లేదు. రాధ మళ్లీ పెళ్లిచేసుకుంటే సరిపోతుంది.' ఉలిక్కిపడ్డాను. నువ్వు రవిని ఎంతగా ప్రేమించావో నాకు తెలుసు. నువ్వు ఎన్నటికీ మరొకర్ని పెళ్లాడవు.

'ఉహూ, మీకు తెలీదు. రాధ రవిని ఎంతగా ప్రేమించిందో ...'

'పిచ్చి మృదూ! అంత ప్రేమించే హృదయమున్న ఆమె ఎవర్నీ ప్రేమించకుండా ఒంటరిగా ఎలా ఉండగలదు? ఎవర్నో ప్రేమించక తప్పదనే నా నమ్మకం!'

రాధా! అప్పటి నుంచి నాకో కొత్త ఆలోచన వచ్చింది. నీ జీవితంలో మళ్లీ వసంతం రావాలి. ఎప్పుడు? నువ్వు మళ్లీ పెళ్లి చేసుకుంటావన్న ఆలోచనే లేకపోతే ఈ బ్రతుకెంత దుస్సహంగా ఉందని! నీ వ్వలా జీవితం పాడవునా చూస్తూ ఉండటం నా వల్ల కాదు. నీ మృదుల.'

* * *

'మృదూ! మీ రిద్దరూ నన్ను గురించి పడుతూన్న బాధకు ఒక విధంగా తృప్తి, మరోవిధంగా విచారమూ కలుగుతున్నాయి. నేను నీ స్నేహితురాలినే. నీ కత్యంత ప్రేమాస్పదురాలినే. అయితే మాత్రం? నీ ఆనందాన్ని, మోహన్‌గారి సాంసారిక సుఖాన్ని గాయపరిచే హక్కు నా కెక్కడిది? మీరు నేను మళ్లీ పెళ్లిచేసుకోవడాన్ని గురించి సూచించారు. అది అవమానంగా కానీ, అవకాశంగా కానీ నేను భావించడం లేదు. అయితే నా కా అవసరం లేదని చెప్పదలుచుకున్నాను. రవి మరణంతో మా బంధం తెగిపోలేదు. అది ఇంకా బలంగా పెరుగుతూంది నా రక్తంలో, గర్భంలో. రవి తన వియోగాన్ని సహించే ఆలంబన నిచ్చాడు; ధైర్యాన్ని ఇచ్చాడు; కర్తవ్యా న్నేర్పరిచాడు. అందువల్ల ఘోరంగా భగ్నమైపోయిందన్న నా బ్రతుకు మరో రూపంగా పూరించబడింది. భార్యగా నా అధ్యాయం ముగిసింది. తల్లిగా ప్రారంభం కాబోతూంది. ఇందులో దుఃఖానికంత ప్రాధాన్యం లేదు. నన్ను కేవలం విధవగా మాత్రమే మీ రింకా గుర్తిస్తూండటం పొరపాటని చెప్పడం నా ధర్మం. కాకపోతే కాంక్షేపం దుర్భరంగా ఉంది. నాలుగు రోజుల కింద విశాఖ కాలేజీకి ట్యూటర్ పోస్టుకి అప్లై చేశాను. కృష్ణప్పగారి పలుకుబడి, ఎమ్. ఎ. డిగ్రీ ఇందుకు ఉపయోగిస్తాయేమో చూద్దాం. విష్ యూ హేపీనెస్! మీ దాంపత్యాని కన్యాయం చేయకండి! నీ రాధ.'


* * *

'మృదులా? నువ్వు వ్రాశావని తమ్ముడు కృష్ణ వచ్చి కలుసుకున్నాడు. అప్పటి నుంచి రోజూనో, రెండు రోజుల కోసారో తప్పక కలుసుకుంటున్నాము. కాలం కులాసాగా గడిచిపోతూంది. సాయంత్రాలు అందమైనవిగా మారిపోతున్నాయి. రెండుసార్లు ఇద్దరం సినిమా కెళ్లాము. కృష్ణ నన్ను మారుస్తున్నాడో, నేను మారుతున్నానోగాని, నాకు తాకిన దెబ్బ పూర్తిగా నయమయిన ట్లనిపిస్తూంది. తీరికగా ఉన్నప్పుడో, కడుపులో పాప కదిలించినప్పుడో తప్ప, రవిని మరిచిపోతున్నానంటే ఆశ్చర్యంగా ఉంది. కృష్ణతో పాటు ఫైనల్ ఎమ్. బి. చదువుతూన్న లక్షాధికారి కనకరావుగా రమ్మాయి లత మన వాణ్ణి లవ్ చేస్తూందిట. 'విష్ యూ గుడ్ లక్' అని అభినందించాను. ఆడపడుచు దర్పం ఎలా వెలిగించాలో ఇప్పటినుంచీ ప్రాక్టీసు చేస్తావా మరి? నీ రాధ.'

* * *

'మృదూ! ఈ మధ్య కృష్ణకు రెండు రోజులు జ్వరం వచ్చింది. చాలా తీవ్రంగా నూట అయిదు డిగ్రీ లందుకుంది. అప్పుడు రూము కెళ్లనీయకుండా నా దగ్గరే ఉంచుకున్నాను. ఇప్పుడు కులాసాగా కాలేజీకి వెళుతున్నాడులే. కానీ, ఆ రెండు రోజులు నేను ఇదివరకు చూపు అందనంత మేర లోకాన్ని చూశాను. చిత్రంగా, విరక్తిగా ఉందే, మృదూ. నే నున్న ఇంటి ఓనరు పెద్దమనిషి. ఏభై ఏళ్ల ప్రాయమూ, ఎనిమిది వందలిచ్చే ఉద్యోగమూ, నలభై ఏళ్ల భార్యా, నలుగు రాడపిల్లలూ గలవాడు. ఆ రాత్రి జ్వర తీవ్రతలో కృష్ణ పలవరిస్తూంటే నాకు భయం వేసింది. ఫోన్ చేసి వాళ్ల ఫామిలీ డాక్టర్ని పిలవమందామని వెళ్లాను. ఏదో మాట్లాడుతున్న వాళ్లంతా టక్కున

తన కంటే, పెద్ద, తన అక్కకు ప్రాణంలో ప్రాణం, అందునా విధవ, చనిపోయిన భర్త రూపం తనలో పెంచుకుంటున్న సౌందర్యవతి - ఆమెను యోగ్యుడైన తను ప్రేమించి పెళ్లాడగలడా! అందునా, తనను ప్రేమిస్తున్న ఓ లక్షాధికారి కన్యను కాదని?



వాళ్లు కట్టేసుకున్నారు. నన్ను గురించే నని స్పష్టమయినా, దాన్ని గురించి కించపడ్డానికి సమయం కాదు. నా అవసరం చెప్పాను. ఒక్క నిమిషం మాట్లాడలేదు. చిరాకు నణగదొక్కుతూ ఓర్పు తెచ్చుకుంటున్నాను. 'అతను నీ కేమవుతాడు?' ఇదీ ఆ పెద్దమనిషి జిజ్ఞాస.

'చూడమ్మాయీ! నేను పెళ్లి కావలసిన ఆడపిల్లలున్న వాణ్ణి. ఏదో చిన్న వయస్సులో బ్రతుకిలా అయిందని జాలితో మా పోర్షనిచ్చాను. అతని గొడవ నీ కెందుకు? అతనికి జ్వరం వస్తే నీ ఇంట్లో ఉంచుకుని సేవలు చెయ్యడానికి నువ్వు స్వంత అక్కయ్యవా? ఇట్లాంటి వేషాలు నాకు నచ్చవు.' వేషాలు అన్న మాటకు ఒళ్లు మండింది.

'అయ్యా, పవిత్రమైన మీరూ, మీ ఆడవాళ్లూ ఊహించింది నిజం. అతను నాకు తమ్ముడు కాదు, ప్రియుడు. అయినా అతను మనిషి. అతనికి జ్వరం వచ్చింది. డాక్టర్ని పిలవమని అడుగుతున్న నేనూ మనిషిని. మీరూ మనుషులే ననుకుంటాను. జాలితో నాకు పోర్షనిచ్చా నంటున్నారు. నేనూ జాలితోనే మీకు నెలనెలా డబ్బిస్తున్నాను. అంత జాలిగల మీరు జ్వరంలో ఉన్న వాడి మీద ఇంత కక్ష చూపడమేమిటి? మా అవినీతి మాకు సంబంధించింది. అది పెళ్లి కావలసిన మీ కూతుళ్ల కెలా తాకుతుంది?'

'ఇట్లా బరితెగించినవాళ్ల నింట్లో ఉంచుకుంటే ...' వాళ్ల పెద్దమ్మాయి అందుకుంది.

'బరితెగించినవాళ్లెవరో మీ నాన్నగారికి తెలియకపోవచ్చు. కానీ, నాకు తెలుసు. అసలు కృష్ణను చూసినప్పటి నుంచీ నీ ప్రయత్నాలు నా కర్థమౌతున్నాయి. అందమైన డాక్టరు మొగుడి కోసం నీ తాపత్రయం తప్పనుకోలేదు. 'నీతి' అనేది మీ ఇంట్లో మీరు ఫ్రిజిడేయిర్‌లో భద్రంగాదాచుకున్నట్లూ, మరొకరు బజారులో పారవేసినట్లూ మాట్లాడకండి! నాతో పోట్లాడ దలుచుకుంటే, మీ ప్రక్కనే ఉంటాను గనక మరెప్పుడైనా సిద్ధమే! ఇప్పుడు కాదు' అంటూ వచ్చేశాను. మనస్సు అశాంతి పాలయింది. ఏం చెయ్యను? స్పృహ లేని కృష్ణ నెలా తీసుకెళ్లడం? చివరకు నేనే వెళ్లి ఏ డాక్టర్నన్నా తీసుకొద్దామని గుమ్మంలోకి వచ్చాను. అప్పుడే కారాగింది నా ముందుగా. డ్రైవరు తలుపు తీస్తే ఒక అందమైన అమ్మాయి దిగింది.

'కృష్ణ ఉన్నాడా?' అంటూ తల ఊపిన నన్ను దాటి ఇంట్లోకి దారితీసింది. ఆమె ఎవరో జ్ఞప్తి కొచ్చింది. లత!



వెల్లూరు శిల్పం ద్వారపాలకుడు
ఫోటో—ఎం. కె. ఆర్. (మద్రాసు)

ఎట్లా తెలిసింది? ఎవరు చెప్పారు? ఈ ప్రశ్న లొకవేపున, ఆమె ప్రవర్తన మరో వేపున మనసులో కాటాతూకంలా నిలుస్తున్నాయి. చూస్తూండగానే డ్రైవరు సాయంతో కృష్ణను కారులోకి చేరుస్తూంది. కనీసం నాతో ఒక్క మాట మాట్లాడలేదు. పక్కింటి వాళ్లకంటే అవమానించింది. అతణ్ణి తీసుకెళ్లడానికి వీల్లేదు—అని అరుద్దామనిపించింది. ఇప్పుడు మా సంగతి కంటే, అతనికి వైద్యం అవసరం. ఊరుకున్నాను. కనీసం నన్నూ పిలుస్తుం దనుకున్నాను. కానీ, కారులో తీవిగా దూసుకుపోయింది. తరవాతైనా ఏ నర్సింగు హోములో చేర్చిందీ చెబుతుందని ఆశించాను. అంత మాత్రపు సభ్యతకి కూడా అర్హురాల్ని కాదని ఋజువు చేసింది. మూడోరోజు కృష్ణ వచ్చాడు. లత, విమలా నర్సింగ్ హోములో చేర్చిందట. ఆ అమ్మాయి మాటెత్తడానికి కూడా అసహ్యం వేసింది. కృష్ణమాత్రం ఆ అమ్మాయి అందానికి, వెనకాల ఉన్న సంపదకి విభ్రాంతిలో ఉన్నాడు. ఇంతకు ముందున్న ఉత్తరంలోని నా అభిప్రాయం ఇప్పుడు మారింది. కృష్ణ జీవితంలో ఆ పిల్ల దగ్గరికి రాకుండా ఉంటే అదృష్టవంతు డనిపిస్తూంది. నీ రాధ.'

* * *

'రాధ మరీ తెలివి తక్కువగా ప్రవర్తిస్తోంది కదూ?' ఉత్తరం భర్త చేతినించి మళ్లీ అందుకుంటూ అంది మృదుల.

'ఇందులో ఆమె తెలివి తక్కువ ఏం కనిపించడంలేదే!' అన్నాడు మోహన్.

'కాకపోతే ఆ పక్కింటి వాళ్లతో ఆ మాటలన్నీ ఎందుకు?'

'ఆ పక్కింటాయన మూర్ఖుడు. ఒక ఆడమనిషి డాక్టర్ని పిలవమని రిక్వెస్టు చేస్తూన్నప్పుడు వాళ్ల బాంధవ్యాలు ప్రశ్నించడ మేమిటి?'

'అదేమంత క్రూరంగా ఉంది? ఎవరైనా అడుగుతారు.'

మోహన్ ఆశ్చర్యంగా చూశాడు.

'ఎవరైనా అడుగుతారా? ఛీ! ఛీ! మృదూ! జ్వరపడిన వాడు నీ తమ్ముడు...'

'నా తమ్ముడనే విషయం వదిలి వాళ్ల దృష్టిలో ఆలోచించాలి.'

'ఆఁ... వదిలేసి ఆలోచించినా, వాళ్లని సమర్థించడానికి వీల్లేదు.'

'వాళ్లు అలా అనడానికి వీలు కలిగేటట్లు ప్రవర్తించి ఉండచ్చుగా? ఉత్తినే ఎవరూ అనరు కదా!'

'ఉత్తినే కల్పించేవాళ్లెవరూ ఈ లోకంలో లేనట్లు మాట్లాడతావేం? వాళ్ల అల్పత్వం సహేతుకమని నిరూ

# ఉద్వాహహోత్సవం

## 'విజయమూర్తి'

చంద్రుని భార్యకి
సూర్యునితో సఖ్యం కుదిరింది!
ఉద్వాహం నిశ్చయమయ్యింది!! —
నిత్యాగ్నిహోత్రులు
అగ్నిహోత్రావధాన్లయ్యారు.
అత్యంత ప్రేమతో
ముఖ్యాతిథిగా ప్రభంజనుణ్ణే పిల్చారు —
హోమగుండం ప్రజ్వరిల్లింది.
మంగళ (!) సూత్రం మిలమిలా మెరిసింది —
పరశురాములు ప్రీతిగా నవ్వారు.
దూర్వాసులు ప్రేమతో పలకరించారు.
విశ్వామిత్రులు విరహతాపంలో ఉన్నారు.
అగస్త్యులు సాగరాల్ని వెతుకుతున్నారు.
శచీంద్రులు మరీచికలు కోరుతున్నారు.
సామాన్య ప్రజలు
హాహాకారాలు చేస్తున్నారు.
సామాన్లు వీథిలో పడేసి
గస్తీలు తిరుగుతున్నారు.
అసమర్థులు కరాలెత్తి
వరుణదేవుణ్ణి పిలుస్తున్నారు.
'ఒకరి ఇంట్లో పెండ్లి
మరొకరి ఇంట్లో శ్రాద్ధం'
అవుతుందంటే ఇదేనా? ★

పించడానికి రాధలో లోపాలు వెదుకుతావెందుకు?'

'కృష్ణ జీవితంలోకి లత రాకుండా ఉంటే బాగుంటుందట. ఇంతలో ఏం తెలుసుకున్నట్టు? ఇది అసూయ కాదా?'

'కాదు. ఆ అమ్మాయి అహంభావిగా కనిపిస్తోంది. కృతజ్ఞత చెప్ప వలసిన చోట తిరస్కారాన్ని చూపటమే ఆమె యోగ్యత ప్రకటిస్తోంది. ఆ అమ్మాయితో జీవితం దౌర్భాగ్యం కాకపోయినా సుఖప్రదం కాదు. కృష్ణ శ్రేయోభిలాషి కోరదగిందీ కాదు.'

• • •

'మృదూ? నీ నించి ఉత్తరాలు రావడం లేదు. మవ్వూ బరువు మోస్తున్నావా ఏమిటి? నా బరువు కరిగిపోయింది. ఒళ్ళు తేలిక అయింది. బ్రతుకు బరువయింది. మనస్సు శూన్యమయింది. మృదూ! ఎలా చెప్పడం? అయిపోం. ఇం. రవి నా జీవితం నించి పూర్తిగా తప్పుకున్నాడు. కృష్ణ నా కంటే చిన్నవాడు. అయినా ఎంత పెద్దవాడుగా, తన సంతానంకోసం ఆదుర్దాపడే తండ్రిలాగా నాకు కనిపించాడు! అందులో రూపెత్తనున్న డాక్టరున్నాడు. అతనే నేమో నా ప్రాణాలకోసం అంతగా పోరాటం సాగించింది. అతను లేకపోతే నే నేమయ్యేదాన్ని? ఈ మన సెంత అల్పమైంది కాకపోతే, రవి బ్రతికి ఉంటే కృష్ణ నా కిలా దొరికేవాడా అని ఆలోచిస్తుందా? అది కృతజ్ఞతా! అభిమానమా? అర్థంకానిదేదో ఉందా? అయితే పాపం, కృష్ణ, లత, లత డబ్బు కిందా పడి నలిగిపోతున్నాడు. 'నాకు ఆరోగ్యం చిక్కింది. రోజూ మువ్వు రా నవసరం లేదు' అని చెప్పాను. ఏం చెయ్యాలి? ఒకసారి లత నా ఎదురుగానే కృష్ణకోసం నేను కావాలనే 'అబార్షన్' చేయించుకున్నానని ఆరోపించింది. చేతిలో ఉన్న 'ఆపిల్' విసిరాను. ముక్కు పగిలి, రక్తం కారుతూ ఏడుస్తూంటే జాలి వేసింది. అటు తిరిగి పడుకుంటే కృష్ణ తీసుకెళ్ళాడు. ఇన్ని జరుగుతూన్నా, ఇంకా ఎంతో మిగిలి ఉన్న ఈ జీవితంతో ఏం చెయ్యాలో తోచడం లేదు. నీ రాధ.'

• • •

ఉదయం తొమ్మిదయింది. మోహన్ ఆఫీసు కెళ్ళడానికి దుస్తులు వేసుకుంటున్నాడు. గుమ్మం ఎదురుగా నిలుచున్న పోస్టుమన్‌ని చూసి ఇద్దరూ ఒక్కసారిగా చేయి సాచారు.

ఎవరి కివ్వాలా అన్నట్టున్న అతణ్ణి చూసి, వాళ్ళ తొందర వాళ్ళ కర్థమైంది.

'ఎక్కడి నుంచి అనుకున్నారు?' అందుకుంటూ అంది మృదుల.

'నువ్వూ ...'

'నేనా? రావాలనుకున్న చోటి నించే వచ్చింది.'

'నాకూ ... అదే కావాలి.'

'ఇది నాకే వచ్చింది.' చించి చూస్తూ అంది.

'సరే, చదువుకుని ఆనందించు' అంటూ లోపలి కెళ్ళాడు.

'అక్కకు ... నీ సలహాలన్నీ చేరాయి. అవి పక్కలో పెట్టుకుని రాధనీ, లతనీ పరిశీలించాను. వాళ్ళిద్దర్నీ తేల్చడానికి నీ సలహాలు గీటురాళ్ళుగా ఉపయోగపడ్డాయి. ఒక్కొక్క సలహా మీద వాళ్ళిద్దర్నీ గీసి చూశాను.. రాధ నిజం బంగారంగా నిలిచింది. 'రవి బ్రతికిఉంటే కృష్ణ నా కిలా దొరికేవాడా?' అన్న రాధ మాటను ఆమె నీచత్వానికి గుర్తుగా ఎత్తి చూపించావు. అందులో నిజాయితీ తప్ప, నీచత్వం నాకు కనిపించలేదు. అట్లాగే లత అంటే రాధ కసూయగా ఉందని నువ్వు చెప్పిన తరవాత రాధ నన్ను ప్రేమిస్తూందని అర్థమైంది. ఆమె ప్రేమిస్తూందని అర్థమైన తరవాత లత అర్థమైంది. వాళ్ళు అర్థమైన తరవాత ఏం చెయ్యాలో అర్థమైంది. ఆ అర్థం వ్యర్థం కాలేదు. రాధ కేవలం నాకంటే పెద్దది అనే అభ్యంతరమే పెద్ద దయితే, నువ్వు నిత్యం వేసే పూల దండల, వెలిగించే అగరు వత్తుల పరిమళాల్లో చిరునవ్వులు కురిసే ఆ రాధాకృష్ణులు జవాబివ్వాలి. నువ్వు ఇది వరలో రాధకు వ్రాసిన ఉత్తరాలు చదివానొకప్పుడు. అవన్నీ నీ గొప్ప గొప్ప ఆశలు. మనసా వాంచించే అభ్యుదయం కాదు. అదే అయితే నీ తమ్ముణ్ణి గురించి నిందారోపణలు చెయ్యవు. ఇంతకూ నువ్వు చూపింది కేవలం సానుభూతి. సానుభూతి వ్యక్తి అల్పత్వం నించి జనిస్తుందని ఒక మేధావి అన్నాడు. అది నిజం! ఎందుకంటే, సానుభూతి తన అవసరాన్ని కోల్పోవడాని కెన్నటికీ ఒప్పుకోదు. అంతకంటే అల్పత్వ మేముంది? పైన 'ఒక మేధావి' అన్నానే ఆ 'మేధావి' ఎవరో కాదు, మా బావగారు. రాధా, నేనూ ఆయనకు ఎంతైనా కృతజ్ఞులం! నీ తమ్ముడు కృష్ణ'.



చిత్రం—పి. ఆగాచార్య ( కరీంనగర్ )

• • •

మగడు మగడుగా కాకుండా 'మేధావి'గా మారిపోయినందుకు ఆమెకు కోపం వచ్చింది. ఆ కోపంలో ఉత్తరం పర్రున చించి ముక్కలు చేసింది. తల దువ్వుకుంటూ కిటికీగుండా ఆమెకేసిచూస్తూన్న మోహన్‌కు జవాబు దొరికింది. మనసులో ఆందోళన తీరింది. ఆమె పక్కగా నడుస్తూ, 'ఫరవాలేదు! ఉత్తరమేగా ...' అంటూ నవ్వుతూ బయటికి అడుగు వేశాడు. ★